క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థినులు

కొత్తూరు: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కేసీఆర్ మెగా 2023 నేషనల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు స్పెరింగ్‌తో పాటు పలు విభాగాల్లో రాణించినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సినీహీరో సుమన్, కేశంపేట జెడ్పీటీసీ విశాల విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా గంగతెప్ప ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగతెప్ప ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఇందుభాగంగా సమీపంలోని చెరువులో గంగతెప్పను వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల మాట్లాడుతూ.. నేడు (మంగళవారం) జరగనున్న బోనాల ఉత్సవాలను అందరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాలు, ప్రాంతాలు జంట నగరాల నుంచి వచ్చిన భక్తులు బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. గ్రామంలో ఎక్కడ చూసిన విద్యుత్ దీపాలు, అమ్మవారి ప్లెక్సీలు, బ్యానర్లు భక్తిపాటలతో మార్మోగుతున్నాయి. ఈ ఊరేగింపులో గ్రామస్తులు రవియాదవ్, శివయ్య, మహేందర్‌యాదవ్, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 140 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న సాంబశివరావు

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 140 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యాయి. మండలకేంద్రంలోని చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో సోమవారం నాలుగవ రోజు రిటైర్డు జడ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో 140 కేసులు పరిష్కరించడంతో పాటు 3లక్షల 47వేల రూపాయలు జరిమానాలు విధించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు. డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పెండింగ్ కేసులకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కొనగట్టు బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ ట్రస్టీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సున్నపు వసంతం, మాణిక్యప్రభులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ..మండలకేంద్రంలోని కొనగట్టు క్షేత్రంలో ఉన్న శివాలయం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అందంగా అలకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్‌టౌన్: పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అధికారులు విద్యుత్ మరమ్మతుల చేపట్టారు. ఈ నేపథ్యంలో నేడు (మంగళవారం) పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో పట్టణ ఏఈ వినోద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ టవర్‌ను మారుస్తున్న కారణంగా ఫరూఖ్‌నగర్, ఇస్లాంపూర్ కాలనీ, అడ్వకేట్, మాలిక్‌కొంటీ, సైనా కొంటీ, సీఎస్‌కే, గోల్డెన్ పార్కు, ప్రభుత్వ ఆస్పత్రి, పాత ఆశియానా, యాదవ కాలనీ, మిలీనియం టౌన్‌షిప్, శ్రీనివాసకాలనీ, రైతు కాలనీ, నాగులపల్లి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారుల సహకరించాలని ఆయన కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?



వంతెన లేని కొమరబండ వాగు

- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న ప్రజలు

షాబాద్: మండలంలోని కోమరబండ- రేగడిదోస్వాడ గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో సరైన రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దశాబ్దాలుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మిస్తే కోమరబండ నుంచి రేగడిదోస్వాడ నుంచి నాగర్‌గూడ, చేవెళ్లకు వెళ్లడానికి సులభమవుతుంది. రహదారి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో కోమరబండ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, మక్తాగూడ, బోబ్బిలిగామ ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. ఈ నాలుగు గామాల ప్రజలు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వాగులో పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో వాగుదాటే సమయంలో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రయాణికులు వాగులో పడి ఇప్పటి వరకు ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. వాగు అవతల వ్యవసాయ భూములు ఉండడంతో నిత్యం ఇబ్బందులు పడుతూ వాగు దాటాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

వాగులో హైలెవల్ కాజ్‌వే నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు సంబంధిత శాఖాధికారులు పేర్కొంటున్నారు. కానీ దాని పురోగతిపై పట్టించుకునే వారే కరువయ్యారు. వాగుపై బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



వందలాది మంది రైతులతో పాటు నాలుగు గ్రామాల ప్రజలకు ప్రధాన రహదారి కావడంతో బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు స్పందించాలి. వాగుపై హైలెవెల్ కాజ్‌వే నిర్మిస్తే దారి కష్టాలు తప్పుతాయి.

–దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోబ్బిలిగామ

వాగు దాటాలంటే కుస్తీ పట్టాల్సి వస్తోంది



వాగుదాటే క్రమంలో రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాగులో పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. వాగు దాటాలంటే కుస్తీ పట్టాల్సివస్తోంది.

–చంద్రశేఖర్, సర్పంచ్ కొమరబండ

గర్భిణుల వివరాల నమోదు తప్పనిసరి

వైద్యాధికారి డాక్టర్ స్రవంతి

షాద్‌నగర్: గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సోమవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ...స్త్రీ గర్భం దాల్చిన మూడు నెలల లోపు తప్పనిసరిగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే, వారికి క్రమం తప్పకుండా టీటీ టీకాలను వేయించాలని అన్నారు. శరీరంలో రక్తం తక్కువ ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్, పోలిక్ మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం వల్ల కలిగే లాభాలను, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి వివరించాలని అన్నారు. అలాగే, గ్రామాల్లో ఎవరైనా టీబీ వ్యాధి బారిన పడినట్లయితే వారికి విధిగా పరీక్షలు చేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధ, శనివారాల్లో సంవత్సరం లోపు పిల్లలందరికి విధిగా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. విధి నిర్వహణలో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఆనంద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఫార్మసిస్టు ఉదయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, నర్సు స్వప్న, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్రవంతి

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శోభ

మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ దారెడ్డి శోభావెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలో కేతిరెడ్డిపల్లి గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమన్నారు. కలిసికట్టుగా కృషి చేస్తే గ్రామం ఆదర్శంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ మురుగు కాలువలు, ఇంటింటికి నల్లా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. మిగిలి ఉన్న అభివృద్ధి పనులు దశలవారీ పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, కారోబార్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్దయ్య, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు నర్సింగ్, అనిమోనీ యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జైపాల్, రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు సహించం

డీఆర్‌డీఏ ప్రభాకర్

శంకర్‌పల్లి: ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనుల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని డీఆర్‌డీఏ ప్రభాకర్ హెచ్చరించారు. సోమవారం శంకర్‌పల్లి ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఈ పథకం కింద ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. మండలంలోని 26 పంచాయతీల్లో మూడు సంవత్సరాలుగా రూ. 9కోట్లతో చేపట్టిన పనులకు ఆడిట్ నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రభాకర్, తదితరులు

కొనసాగుతున్న కంటి వెలుగు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొందుర్గు: మండల కేంద్రంతో పాటు, రేగడిచిల్కమర్రి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. సోమవారం రేగడిచిల్కమర్రి గ్రామంలో కంటి వెలుగు పూర్తయ్యిందని, మంగళవారం నుంచి చౌదరిగూడ ఆర్యసమాజంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తామని మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రితజోసెఫ్ తెలిపారు. అయితే, కొందుర్గులో గత నెల 19న ప్రారంభమైన కంటి వెలుగు ఇంకా కొనసాగుతుంది. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి సురేఖ, వైద్య సిబ్బంది అశ్వాక్, సుజాన్, సువర్ణ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణం అభినందనీయం

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

షాబాద్: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కోసం బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బోనగిరిపల్లి చౌరస్తా వద్ద అదే గ్రామానికి చెందిన లింగాల చంద్రమ్మ, చంద్రయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బస్‌షెల్టర్‌ను నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సర్పంచ్ జయమ్మ, కలిసి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో తల్లిదండ్రులను సరిగ్గా చూసుకొని తరుణంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బస్ షెల్టర్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వారి కుమారులు భూషణయ్య, మేసురత్నం, ప్రకాశ్, ఆనందం, జాన్, మాణిక్యం, సుదీర్, సుధాకర్, గ్రామస్తులు యాదయ్య, ఆనందం, మల్లేష్, అనంతయ్య, ఎల్లేష్, గణేష్ తదితరులున్నారు.

పదో తరగతి విద్యార్థులకు చేయూత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న మహ్మద్ ఫారూఖ్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందించే సహాయం వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఊరేళ్ల పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రాజు అన్నారు. మండలంలోని ఊరేళ్ల పాఠశాలలో సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థి మహ్మద్ షారుఖ్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి (పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్స్, పెన్నులు తదితర) ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. అంతేకాకుండా 10వ తరగతిలో మొదటిస్థానంలో నిలిచిన ఐదు మంది విద్యార్థులకు ఇంటర్మీడియేట్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయటానికి అవసరమైన కళాశాల ఫీజును తానే భరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్య విలువను గుర్తించి పూర్వ విద్యార్థి ముందుకు వచ్చి విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు తమకు తోచిన విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడంతో వారి భవిష్యత్తుకు సాయం చేసిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ అక్బర్, కృష్ణ, ప్రకాశ్‌రెడ్డి, శ్రీశైలం, భాగ్యలక్ష్మి నర్మదా పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

- వేద మంత్రోచ్ఛరణాలతో మార్మోగిన శివాలయం
- కనుల పండువగా సాగిన కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: పచ్చని పందిరి, పూల తోరణాలు శివపార్వతుల కల్యాణం భక్తులకు కనువిందు చేసింది. కనకమామిడి సంగమేశ్వర దేవాలయ మహోత్సవంలో మూడవ రోజు సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వేద పండితులు, ఆలయ పూజారులు, మంత్రోచరణాల మధ్య కనుల పండువగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులకు వస్త్రాలు, పూలు, పండ్లు, తలంబ్రాలను సమర్పించి కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచరణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులకు శివపార్వతుల దర్శనంతో పాటు దేవాలయంలో శివలింగ దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొనడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి

ఏడీఏ రాజారత్నం



పంటను పరిశీలిస్తున్న రాజారత్నం

కొందుర్గు: యాసంగిలో రైతులు సాగుచేసిన పంటల్లో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంటల దిగుబడి పెరుగుతుందని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం సూచించారు. సోమవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం జాకారం గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, కూరగాయలు, పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరిలో జింక్ లోపం అధికంగా కనిపిస్తుందని, ఇదివరకే వరి నాటువేసిన రైతులు నివారణ కోసం లీటర్ నీటికి 2 గ్రాముల జింక్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే, వరి నాటేవేయని రైతులు ఎకరాకు 10 కిలోల జింక్‌ను దుక్కిలో చల్లి కలియదున్నాలని చెప్పారు. వేరుశనగ పంట ప్రస్తుతం పూత దశలో ఉందని, పూత నిలబడి ఊడలు సాగేందుకు ఎకరాకు 200 కిలోల జింక్‌ను అందించాలన్నారు. పంటలను చీడపీడల నుంచి కాపాడేందుకు అవసరాన్ని బట్టి పురుగుమందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవి కుమార్, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని బీఆర్ఎస్

కాంగ్రెస్ నాయకుడు శంకర్

కొత్తూరు: వచ్చే అంసెబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తథ్యమని కాంగ్రెస్ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధాపూర్ గ్రామం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి హాత్ సే హాత్ జోడో యాత్రను ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ విద్య, అర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే చేపట్టిన పలు ప్రాజెక్టులకు పేరుమార్చి నిధులు పెంచి ప్రజల సొమ్మును దోచుకుంటున్న ఘనత బీఆర్ఎస్‌కు మాత్రమే చెల్లిందన్నారు. యాత్రలో భాగంగా నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు, కేడర్ల మధ్య ఎవైనా సమస్యలు ఉంటే వాటిని అధిగమించి పార్టీ విజయం కోసం సైనికుల్లా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మొదటి రోజు సిద్ధాపూర్ నుంచి పెంజర్ల వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రఘు, యాదయ్య, రాందాస్ నాయక్, దేవేందర్, కుమార్‌స్వామిగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నూనెగింజల సాగుపై దృష్టి సారించండి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

షాబాద్: రైతులు పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా నూనెగింజల సాగుపై దృష్టి సారించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆముదం సాగుపై రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో రైతులకు ఆముదం పంట సాగు ప్రాధాన్యత గురించి వివరించారు. పత్తి పంటకు బదులుగా రైతులు నూనె గింజల సాగు చేపట్టాలని తెలిపారు. ఆముదం పంట ఎలా సాగు చేసుకోవాలో రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. రాత్రి పూట విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పలు మార్లు రైతులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంతో లేదన్నారు. విద్యుత్ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసిన నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, చంద్రబాబు, చంద్రయ్యగౌడ్, అంజయ్య, రైతులు తదితరులున్నారు.

ప్రత్యేక తరగతులతో ప్రయోజనం

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి

నందిగామ: 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక తరగతులను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన సోమవారం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉదయం 1 గంట, సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత మరో గంట పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారని అన్నారు. ఉదయం వేళల్లో సరైన సమయానికి ఇంటి వద్ద అల్పాహారం చేయకుండానే కొంత మంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు అవుతున్నారని, ఈ సమయంలో వారు ఆకలితో ఇబ్బంది పడకుండా తాను అల్పాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏకగ్రతతో చదువుకోవాలని, పాఠశాల నుంచి నూటికి నూరు శాతం ఉతీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దినేష్, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పహారం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

ప్రజలను మభ్యపెట్టేందుకు కేసీఆర్ నాటకం

బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రజలను మభ్యపెట్టేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దొడల వెంకటేష్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఖర్చు చేయని కేసీఆర్ కేంద్రంతో నీటి వాటాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల ఆంధ్రా వారు తరలించుకుపోతుంటే దాని గురించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడడం లేదన్నారు. ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో సీఎం మళ్లీ ఆంధ్రా కాంట్రాక్టర్లకు తెలంగాణ సొమ్మును దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. అదేవిధంగా మండలాల పునర్ విభజనలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలానికి అన్యాయం జరిగిందన్నారు. మొగిలిగిద్ద, చించోడ్‌లను ఎందుకు మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కిషన్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్, భీమయ్య, నర్సింహ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి